మూడు కుక్కలు

ఈ రోడ్డుకు అయిదారు గజాల దూరములో వున్న ఇసుకలో పడుకొనివున్నది ఆ కుక్క. సాయంత్రమైనది. అది కళ్లు తెరిచినది. కొంచెము సేపు ఆలోచించినది. పొద్దుటనుంచీ తానేమీ తినలేదనే మాట మొట్టమొదట జ్ఞాపకము వచ్చినది. నెమ్మదిగా లేచి నిలుచున్నది. దానికి ఆకలివేసినప్పుడు అది ప్లీడరుగారి పెరటిదొడ్డిలో ప్రవేశించడము మామూలు. ప్లీడరుగారి పెరటిదొడ్డికి చుట్టూ నాగజెముడు. అది చులాగ్గా దాటడము నేర్చుకొన్నది. ఈ మాటుకూడా పెరటిదొడ్డిలోకి వెళ్ళవలెనని అనుకొన్నది.

కాని వుదయం పది పదకొండు గంటలవేళ మామూలు ప్రకారం అక్కడికి వెళ్ళడమూ దొడ్డి అంతా పరీక్ష చెయ్యడమూ ఏమీ దొరక్కపోవడమూ జ్ఞాపకము వచ్చినది. దొడ్డిఅంతా తిరిగి తిరిగి ఏమీ దొరక్క, పోనీ రోడ్డుమీద కొంతసేపు పచారుచేస్తే ఏ ఇంటి ముందైనా ఏమైనా దొరకక వచ్చునని అది రోడ్డు మీద తిరగడమూ, ఆ రోడ్డుమీద ఇళ్ళను ఆశ్రయించుకువున్న కుక్కలు దానితో కలియబడడమూ, అది తప్పించుకొని పారిపోవడమూ. ఇత్యాది విషయములన్నీ జ్ఞాపకము వచ్చినవి.

లేచి నిలబడి ఏమి చేయడముకూ దానికి తోచినదికాదు. ఒక్కమారు ఒళ్లు విరుచుకొని ఇసుక దులుపుకొని మళ్ళీ బద్ధకముగా వుండుటచేత ఇంకో కునుకు బోతే బాగుంటుం

దేమో నని అది అనుకొన్నది. పడుకుంటే ఆరోజుకు అసలే ఏమీ దొరకదేమో నని దిగులు వేసింది. ఎక్కడకు వెళ్ళ డానికీ బలము లేదు. పోనీ ప్లీడరుగారి పెరటి దొడ్డి మళ్ళీ పరీక్ష చేస్తే ఏమైనా దొరకవచ్చునేమో అనుకొన్నది. కాని ఇంకోమారు నిద్రపోవలెననే దానికి తోచింది. ఈ రీతిగా యే ఆలోచనా తెగక కిందా మీదా పడుతూ వుంటే దాని పక్కనుండి ఒక రాయి రివ్వున పోవడము అది కనిపెట్టింది. దాని బద్ధకమంతా ఒక్కమారు పటాపంచ లయింది. ఇటూ అటూ చూచింది.

కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కేకలు వేసుకుంటూ కొందరు బడిపిల్లవాళ్లు ఆ రోడ్డునపోతూ నిలబడ్డ ఈ కుక్కను చూచి అందుబాటులో వున్న బెడ్డలను ఏరి ఈ కుక్కకేసి విసిరారు. ఒక బెడ్డ పక్కనుంచి పోయింది. ఇంకో బెడ్డ దాని చట్టమీద తగిలింది. అది కయ్యో అని అరుస్తూ ఒక కాలెత్తి కొంత దూరం పరుగెత్తి, దాని వెనకే వడివడిగా వస్తూ వున్న రాళ్ళను కనిపెట్టి ఆ కాలు దింపి అలవాటు చొప్పున ఇంకో కాలెత్తి పరుగెత్తి ఒక్క చెంగున కంచె దాటి ప్లీడరు గారి దొడ్డిలో పడింది. పిల్లవాళ్ళందరూ చప్పట్లు కొట్టి నవ్వు కొన్నారు. వారికి వుత్సాహం అతిశయించింది.

ప్రపంచములో రోడ్లమీద నున్న బెడ్డల యొక్క ప్రయోజనము కుక్కలను కొట్టుటకే అనే చిత్తవృత్తి గల బడిపిల్ల లకూ, ఊరకుక్కలకూ ఆజన్మవిరోధము.

ఈ సంగతి మనకుక్కకు తెలుసును. ఒకమూల ఆకలి బాధ. ఇంకోమూల దెబ్బబాధ. బడిపిల్లలను మనసులో

నాలుగుతిట్టి అక్కడకూర్చుని దెబ్బతగిలినచోట నాకుకొన్నది. కొంతసేపటికి కొంచెం బాధ తగ్గినది. మళ్ళీ లేచి నిలబడి ఒకకాలు పైకెత్తి నాలుగువేపులా ముట్టెచాచి వాసన చూచినది. కాని ఏమీ లాభించేటట్టులేదు. అయినా అలవాటు చొప్పున ప్లీడరుగారి ఇంటిచుట్టూ పచారు చేసింది. అన్ని తలుపులూ తోసి చూచింది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లులేదు. పెరట్లో ఏమీ పుల్లాకులు లేవు. ఇక లాభములేదని దానికి తోచింది. దొడ్డిలో తిరిగితే మిడతలేవైనా దొరుకుతవేమోనని ప్రయత్నం చేసింది. కాని అనుకొన్నట్లు దానికి ఒక మిడతా దొరకలేదు. ఆకలి దహించుకుపోతోంది. ఏదో ఒక విధంగా ఆహారం సంపాదించుకొంటేనే గాని బ్రతికే విధం లేదు. ప్రక్కఇంటి కుక్కలతో స్నేహముచేసో యుద్ధము చేసో, ఏదో ఒకవిధంగా పొట్ట నింపుకోవలెనని అనుకొన్నది. ఆ దొడ్డిని వదలిపెట్టి ప్రక్కఇండ్లకేసి వెళ్లింది.

చిన్నప్పటినుంచీ ప్లీడరుగారి ఇల్లు కనిపెట్టుకొని బ్రతుకుతు వస్తోంది ఈ కుక్క. నువ్వు ఎవరి కుక్కవని ఎవరైనా స్నేహితులడిగితే నేను ప్లీడరుగారి కుక్కనని అది చెప్పుకోవడము అలవాటు. సాటి కుక్కలకు ఈమాట గర్వోక్తిగా తోచేది. అందుచేత అవి దీనిని దగ్గరకు రానిచ్చేవి కావు.

వాటిలో ఒక చిన్న తెల్లకుక్కకు దీనిని చూస్తే అసలే విరోధం. కారణం అది తెల్లకుక్క. ఇది ఎర్రకుక్క. అంతే కాకుండా దీనికి వంటినిండా చిడుముకూడాను.

తెల్లకుక్క తాను జాతికుక్క నని చెప్పుకోవడం కద్దు. నిజానికి అది జాతికుక్క కాదు. దాని తండ్రి ఒక ఊరకుక్క.

తల్లి ఒక జాతి కుక్క. తల్లిని ఆ ప్రాంతాన కాపురమున్న ఒక తెల్లదొర పెంచేవాడు. ఆదొరకి భార్యాపిల్లలు ఎవరూ లేరు. ఈ కుక్కే సమస్తమూగా భావించి దానికి ఇల్లుకట్టి ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటుచేసి సర్వోపచారాలు చేయించేవాడు. ఊర కుక్కల సహవాసం చేసిపోతుందేమో నని చాలా జాగ్రత్తగా ఉండేవాడు. ప్రతిరోజూ దొర తాను స్వయముగా దీనిని షికారు తీసుకుపోయే వాడు. ఒకనాడు షికారులో ఈ జాతి కుక్కకు ఒక ఊరకుక్క దృగ్గోచరమైనది. దానిని చూచీ చూడడంతోనే మోహించింది. తక్షణం దాని దగ్గిరికి పరుగెత్తుకొనివెళ్లి దాని ముట్టె వాసన చూచి సంభాషణ మొదలు పెట్టింది. తన్ను ప్రేమించవలసినదనీ, తన ప్రేమ పవిత్రమైనదనీ, తన్ను ప్రేమించకపోతే ప్రాణములు వదలి పెట్టుతాననీ ఈరీతిగా తెల్లదొరల ప్రేమ తత్వాన్ని దానిముందు ఏకరువు పెట్టింది. ఊరకుక్క దానిని ఊరుకోబెట్టి ప్రేమ సూచకముగా ఒళ్లు నాకింది—

కుక్క తన వెనకే వస్తోందని భ్రమపడ్డ తెల్లదొర వెనకకు తిరిగి చూచి అది చేస్తూ ఉన్న అకార్యకరణమును గ్రహించి వెంటనే పరుగెత్తుకు వచ్చి ఊరకుక్కను రాళ్లతో కొట్టగా అది పారిపోయింది. జాతి కుక్కను కూడా పిలుచుకుపోయి నాలుగు తన్ని బుద్ధి చెప్పాడు. కాని తెల్లకుక్క అహర్నిశమూ ఊర కుక్క మీద మనస్సు పెట్టుకొని ఉన్నది.

ఏలాగైతే నేమి అది ఒకనాడు తప్పించుకొని పోయి తిరిగి తిరిగి తన నాథుణ్ణి కలుసుకొన్నది. అవి కొన్నాళ్ల పాటు వీథుల వెంట తిరుగుతూ పొట్ట నింపు కుంటూ స్వేచ్ఛగా

ప్రణయ గీతములు పాడుకొంటూ కాలక్షేపము చేసినవి.

తన కుక్క తప్పిపోయిందని తెల్లదొర మతిపోయి తిరిగి తిరిగి చివరకు ఒక మునిసిపల్ డబ్బాలో ఊర కుక్కలతో పాటు విస్తళ్లు నాకుతూ ఉండగా చూచి దానిని ఇంటికి తీసుకుపోయాడు. ఇంటికి వెళ్ళిన తరువాత దానిని బాగా తన్ని సబ్బుతో ఒళ్లంతా తోమి నీళ్లుపోసి మాంసమూ బిస్కత్తులూ పెట్టి గొలుసుతో కట్టిపెట్టి కాపలా మనిషిని బూట్సు కాలుతో ఒక తన్నుతన్ని ఒక రూపాయి జుల్మానా వేశాడు.

జాతికుక్కకు నెలలు నిండినవి. నాలుగు మగ కుక్కలను కన్నది. వాటి నన్నింటినీ తీసుకువెళ్ళి చంపివేయ వలసినదని తెల్లదొర కాపలా మనిషికి ఉత్తరువు చేశాడు. వాడు ఆ నాల్గింటినీ తీసుకుపోయి జాతి కుక్కలని చెప్పి పొరుగూరిలో అమ్మి వేశాడు. అందులో ఒక కుక్క యజమానిచేత వదలి పెట్టబడి బ్రతుకుకోసం ఈ ఊరువచ్చి ఒక ఇంటిని ఆశ్రయించి బ్రతుకుతూ తాను జాతి కుక్కనని చెప్పుకుంటూ ఊరకుక్కలమీద ద్వేషభావము వహించి కాలము గడుపుతూ ఉంది.

దీనికి మన ఎర్రకుక్కను చూస్తే అసహ్యం. అనేక మార్లు అన్యాయంగా దానిమీద బడి దానిని కొఱికి విడిచి పెట్టేది. పాపం, ఎర్ర కుక్క దానికి లొంగి పోయేది. దానిని చూడడం తోనే తోక ముడిచేది.

ఈ రోజున ఎర్రకుక్కకు ఆకలి విశేషంగా వేస్తూఉన్నది. ఆహారము దొరికేటట్లయితే తెల్లకుక్క వచ్చినాసరే యుద్ధముచేసి దానిని తరిమివేసి కడుపు నింపుకోవాలని ఆలోచించి

ఆ రోడ్డున దర్జాగా నడిచి వెళ్లుతోంది. ఆ రోడ్డుమీదనుంచే ఒక మాలవాడూ వానిభార్యా కబుర్లు చెప్పుకుంటూ పొరుగూరు వెళ్ళుతున్నారు. మాలవాని చేతిలో రొట్టె ఉన్నది. అతడు తన భార్యకు పెట్టుతూ తాను తింటూ తలమీద మూటా, చంకలో కర్రా పెట్టుకొని పోతున్నాడు.

కుక్క వాళ్ళను చూచి వెంబడించింది. మాలవానిభార్య కుక్కనుచూచి కొంచెము దానికి రాల్చింది. కుక్క తిన్నది. ఆకలి హెచ్చింది. వాళ్లను వదలిపెట్టకుండా కుంయి కుంయి మంటూ వాళ్ల వెనుకపడింది. మాలవాడు చంకలో కర్ర తీశాడు. కుక్క ఆగిపోయింది. మాలవానిభార్య నవ్వుతూ పెంకెతనానికి కుక్కకేసి రొట్టెముక్క విసిరింది. కుక్క అది తిని వాళ్లవెనక మళ్లీ వెళ్లింది. మాలవాడు బెడ్డ విసిరేడు. కుక్క వెనకకు మళ్ళింది.

ఆ ప్రాంతాలనే తిరుగుతున్న తెల్లకుక్క దీనిని చూచింది. నెమ్మదిగా దగ్గిరకు వచ్చింది. ఎర్రకుక్క తోక ముడిచింది. దానిముట్టె వాసనచూచింది. తెల్లకుక్క తన ప్రాంతాలకు వచ్చి అది ఏదో తిన్నదని ఊహించి పళ్లు తెరచి మొరిగింది. ఎర్రకుక్క తోకముడిచే పళ్లు చూపించింది. తెల్లకుక్క మొరుగుతూ దానిమీద పడింది. ఎర్రకుక్క పరుగెత్తింది. తెల్లకుక్క వెంటబడింది. ఎర్రకుక్కకు అలసట వచ్చింది. తెల్లకుక్క దానిని కలుసుకుంది. దానిమీద పడింది. ఎర్ర కుక్క ఇదివరలో తానను కొన్న మాటలు జ్ఞాపకము చేసుకొన్నది. ఏమైనా సరే సొంతముగా యుద్ధము చేయదలచింది. రెండు కుక్కలూ తలపడ్డాయి. ఘోరముగా యుద్ధము జరుగు

తోంది. ధూళి పయికి లేచిపోతోంది. తెల్లకుక్క ఎర్రకుక్క పీక గట్టిగా పట్టుకొంది. ఎర్రకుక్క వదలించుకొని తెల్లకుక్క తోక కొరికింది. తెల్లకుక్కకు ఉక్రోషము వచ్చింది. తిరగబడి దానిని కిందకు తోసింది. దానిమీద నిలబడి మొరుగుతూ అందుబాటులో ఉన్న దేహాన్ని కరుస్తోంది. అదృష్టవశాత్తు ఈ యుద్ధము ఒక ముసలికుక్క చూచింది. అది పిల్లలతల్లి. తక్షణం తరుగెత్తుకువచ్చి తెల్లకుక్కను చూచి మొరిగింది. తెల్లకుక్క జవాబు మొరిగి కిందబడ్డ కుక్కను పీడిస్తోంది. ముసలికుక్క తెల్లకుక్కమీద పడింది. ఎర్రకుక్క తప్పించుకొని లేచింది. ఈ రెంటి ధాటికి తాళలేక తెల్లకుక్క పరిగెత్తింది. ముసలికుక్క ఎర్రకుక్కను సముదాయించి తన పిల్లల దగ్గిరికి వెళ్ళిపోయింది.

ఎర్రకుక్క ఒళ్ళంతా మండుతోంది. అంతకంటె ఎక్కువ మంట కడుపులో మండుతోంది. బుర్ర వంచుకొని రోడ్డు మీదనుంచి వచ్చినదారినే వెళ్ళుతోంది.

తెల్లవారి లేచి ఎవరి మొహం చూసేమో గదా అనుకుంది. ఇంతకాలంనుంచి బ్రతుకుతు వస్తూఉన్నా ఇంత తిండి లేకపోవడం ఎప్పుడూ తటస్థించ లేదనుకొన్నది. ఇప్పు డింక ఎక్కడకు వెళ్ళేది? ఎవళ్ళింటికి వెళ్ళినా అక్కడ కుక్కలు తన్ను రానియ్యవు. పోనీ కాఫీహోటళ్లకి వెడదామా అంటే వెధవ దుంపనెయ్యి వాసన. పోనీ, ఏ దుంపనెయ్యి వాసనైనా సహించి పొట్ట నింపుకుందామా అంటే ఆ హోటళ్లను ఆశ్రయించి బతుకుతూఉన్న కుక్కలకు మితిలేదు. అవి దాన్ని దగ్గిరకు రానియ్యవు. అయినా యీ ప్లీడరు కుటుంబము

ఎక్కడకు వెళ్ళినట్టు? తన సంగతి వాళ్ళకేమీ అక్కర్లేదు గదా, వారిల్లు తాను కనిపెట్టుకుఉన్నా! అయినా మానవులకు కృతజ్ఞత వుండడం అసంభవం. ఇప్పుడు ఏమిచేసేదీ? ఈ రోజుకు ఇంక తిండిలేదుకాబోలు.

అని అనుకొంటూ వుండగా దాని ముక్కుకు ఒక సువాసన తట్టింది. అది ఆగింది. ముట్టి ఎత్తింది. నాలుగువేపులా పరకాయించి చూచింది. వాసనచూచింది. ఒక దిక్కునుంచి పకోడీల వాసన రావడం కనిపెట్టింది. ఆ దిక్కుగా నడిచి వెళ్ళింది. ఒక ఇసుక పర్రమీద నలుగురైదుగురు మానవులు మధ్య నేమో పెట్టుకొని ప్రపంచమంతా మరిచి తింటున్నారు. క్రమంగా వారిని సమీపించ దలచుకొన్నది. కాని దానికి సందేహం వేసింది. ఈ మానవులు నమ్మదగ్గవాళ్ళేనా అని. కొంచెం పరకాయించి చూచింది. వీళ్ళు బడిపిల్లలు కారని తోచింది. బడిపిల్లలు కాకపోతే అసురసంధ్యవేళ ఈ భోజనా లేమిటి? అనుకొన్నది. ఈ గొడవంతా నా కెందుకు? నన్ను చూచి ఏమైనా పారవేస్తారేమో సమీపించి చూస్తాను అనుకొని సమీపించింది. దుంపనేతివాసన కొట్టింది. ఈ సంధ్య వేళ ఈ దుంపనేతి సరుకు ఈ మానవులు ఎలాగ అనుభవిస్తున్నారోగదా అనుకొని ఈ రోజు లేచినవేళ మంచిది కాదనుకొని వాళ్ళకేసి రెప్పవెయ్యకుండా చూస్తోంది.

అక్కడ మంది తక్కువ, తినేసరుకు ఎక్కువగా ఉంది. ఎవరి కిష్టము వచ్చినది వారు తింటున్నారు. ఎవరికీ ఇష్టంగా లేని సరుకు వాళ్ళు వదలిపెట్టినారు. పోనీ ఆ కుక్కకేనా పెట్టండి అని ఒకరన్నారు. ఒకముక్క కుక్కవేపు పారవేశారు.

ఎర్రకుక్క సంతోషించి ఆ ముక్క ఒక్కమారు నోట్లోకి తీసుకొని మ్రింగివేసి వాళ్లకేసి మళ్ళీచూడ్డం మొదలుపెట్టింది. తమతోపాటు తిననిస్తారేమోనని వారిని సమీపించింది గాని వాళ్ళు ఇష్టపడ్డట్టులేదు. అందుచేత దూరంగానే నిలబడి వాళ్ళు పారేసే పకోడీముక్కలుతింటూ నిలబడ్డది. శుష్కోపవాసం అనుకుంటే ఏదో పథ్యం పెట్టుతున్నారుగదా అని సంతోషించింది. ఈ రీతిగా కొంత ఆకలి తీరింది. పూర్తిగా తీరవచ్చునని అనుకొన్నది కాని ఒక అభ్యంతరము వచ్చింది.

తెల్లకుక్క ఏలా పసికట్టిందో కాని ఆ స్థలానికే పరుగెత్తుకు వచ్చింది. అక్కడ కూర్చున్న మానవులను పరకాయిస్తూ వచ్చి దూరాన నిలబడింది. అందులో వకరు ఎర్రకుక్కవైపు ఆహారము వెయ్యడం చూచింది. ఎర్రకుక్క తోకముడిచి దానిని మింగడం చూచింది. తనకు ముందుగా ఎర్రకుక్క అక్కడకు వచ్చిందని కోపమూ, ఒంటిపట్టుగా దొరికిందిగదా పాతవైరాలు తీర్చుకోవచ్చునని ఆశా పురిగొల్పగా పరుగెత్తి వెళ్ళి దానిమీద పడింది. ఎర్రకుక్క జాలిగా మొరిగింది.

మానవులకు జాలివేసింది. అందు వక పెద్ద మనిషి న్యాయాన్యాయ విచారణ దక్షుడు, ఒక గొడుగు తీసికొని తెల్లకుక్కను శిక్షించవలెననే ఊహతో లేచాడు. యుద్ధము చేస్తూ ఉన్న రెండు కుక్కలూ ఆతనికేసి చూచినవి. రెండూ భయపడినవి. కాని ఆయన గొడుగు దెబ్బకు తెల్లకుక్క లక్ష్యము కాబోవుతున్నదనే సంగతి తెల్ల కుక్క కనిపెట్టి పరుగెత్తింది. ఆయన దానివెంట తరుముకు వెళ్లాడు. అది ఆయనకేసి

చూస్తూ పరుగెత్తుతూ, నవ్వుతూ "రా, రా, నన్ను కొట్టు దువుగాని లే, రా. నీబోటివాళ్లను చాలామందిని చూశాను" అనే భావము వెల్లడిచేసే దృష్టులతో ఆయనను కొంతసేపు తనవెంట త్రిప్పుకొన్నది. వాళ్ళు కూర్చున్న ప్రదేశానికి చుట్టూ ఆయనను త్రిప్పింది. ఆయన విసిగి దాన్ని "తెల్ల జాతి గుణం పోనిచ్చుకున్నావు కావులే" అని తిట్టి మళ్ళీ వచ్చి కూర్చుని ఎర్రకుక్కకు ఆహారం వేశాడు. ఎర్రకుక్కకు ఆయన మీద అభిమానము భక్తి కుదిరినవి. మానవులలో ఇటు వంటివాళ్ళుకూడా ఉంటారు కాబోలు ననుకొన్నది.

ఆయన కూర్చునీ కూర్చోకముందే తెల్లకుక్క అక్కడికి వచ్చి నిలబడింది. ఎర్రకుక్కకేసి తీవ్రముగాచూచి అనువు గాని-చోట అధికుల మనరాదు, అనుకొని ఏమైనా తనవైపు పకోడీలు వస్తవేమోనని ఆశించింది. దానికీ కొంత ఆహారం దొరికింది. కాని ఎర్రకుక్కకు మానవులమీద కలిగిన మంచి అభిప్రాయం మారిపోయింది. ఆ పెద్దమనిషి తెల్లకుక్కమీద తనకుగల కోపాన్ని పకోడీలతో కొట్టి తీర్చుకున్నాడు.

ఇది ఇలా ఉండగా ముసలికుక్కకూడా అక్కడకు రావడం తటస్థించింది. అది పిల్లలతల్లి అనేసంగతి మానవులు కని పెట్టేరు. దానినిచూచి తెల్లకుక్కా ఎర్రకుక్కా గౌరవముతో తప్పుకొన్నవి. ముసలికుక్కకూడా ఆహారము కోసమే వచ్చి నట్లు మానవులకు స్పష్టమయింది. దానికికూడా కొంత పార వేస్తూ ఒక మానవుడు అన్నాడుగదా "అంత తనపొట్ట పోషించుకోలేని స్థితిలోవుండి తాను ఎందుకు పిల్లలను కన వలెను, పిల్లలకు పెట్టగల సామర్థ్యము తనకుంటేగా?". ఇంకో

మానవుడు "తెల్లదొరలు సంతాన నిరోధము చేసుకొనుటకు ప్రసాదించిన సూక్ష్మమార్గము లుంటూండగా ఈపిల్లలను కనడము బాధపడడము ఎందుకు? ఇంతకీ వెధవ కుక్కబుద్ధి ఎక్కడకు పోతుంది?" అన్నాడు.

ఈ మాటలు వినడంతోనే ముసలికుక్క నొచ్చుకుంది. తాము చెడడమే కాకుండా లోకాన్నంతా చెరచడానికి ప్రయత్నిస్తున్నా రీ మానవులు అనుకొని ఎన్నితిట్లు తిట్టినా ఒక పకోడీకి సమానంకాదు అని సమాధానం చెప్పకొని నిలబడింది.

మానవుల ఫలహారాలయినవి. చీకటిబడినది. వాళ్ళు లేచి పోయారు. "విరగడైంది బాధ" అనుకొని కుక్కలు వాళ్ళు వదలిపెట్టిన బుట్ట నాశ్రయించినవి. మళ్ళీ అక్కడ యుద్ధము జరుగవలసినదే. కాని తెల్లకుక్క తెలివైనదికాబట్టి దేశకాల పాత్రములను కనిపెట్టి మానవులను నాలుగు తిట్టి ఎర్రకుక్క కేసిచూచి "జ్ఞాపకముంచుకో నాకు దొరక్కపోవులే" అని చెప్పి లేచిపోయింది. ముసలికుక్క మిగిలిన ఆకులను నాకి పాలు చేపు రావడముచేత పిల్లలను తలచుకొని పారిపోయింది.

కొంత ఆకలి తీర్చుకొన్నది కాబట్టి ఎర్రకుక్క మానవుల వెంట వెళ్లదలచుకొని ప్లీడరుగారిల్లు జ్ఞాపకము రాగా అక్కడకు పరుగెత్తుకువెళ్లి వాళ్ల అరుగుమీద ముంగాళ్ళమీద మూతిని పెట్టి లేని ఈగలు దట్టుకుంటూ పడుకొంది.

1928